క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలి అర్బన్: తెనాలి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 35వ వార్డు అక్కల వారి వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్‌లకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.12 లక్షలతో వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొడవర్తి శ్రీసాయి హరేరామ్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ ఆంజనేయులు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళులు



తెనాలి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81వ జయంతిని బుధవారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ టెక్నాలజీ రంగంలో భారతదేశాన్ని ముందుకు నడిపించిన ప్రధానిగా కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ తెనాలి పట్టణ అధ్యక్షుడు పాన్నూరు నాగ సూర్యశేఖర్ రావు, రూరల్ మండల అధ్యక్షుడు మల్లవరపు ప్రసాద్, మీడియా కో–ఆర్డినేటర్ మాదాల పూర్ణచంద్రరావు, భీమ రమేష్, చందు అయ్యప్ప, కోటేశ్వరరావు, స్టీవెన్ బాబు, అనిల్, వీరస్వామి, సురేష్, నాగూర్, కార్తీక్ శ్రీనివాసరావు, వెంకటేష్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. సీహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వృద్ధిని నివారించవచ్చన్నారు. ఇంటి చుట్టుపక్కల మురుగునీటి పారుదల సక్రమంగా ఉన్నదీ లేనిదీ గమనించాలని, నీటి పారుదల సక్రమంగా లేనిచో దోమలు వృద్ధి చెంది టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని చెప్పారు. అనంతరం సెయింట్ పాల్స్ పాఠశాల విద్యార్థులకు దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ షేక్ అబ్దుల్ రెహమాన్, ఎంపీహెచ్ఏ బాబురావు, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు కృషి చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ



మంగళగిరి టౌన్: దేశ సమైక్యత, సమగ్రత కోసం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కృషి చేశారని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళగిరి నగర పరిధిలోని బస్టాండ్, భార్గవపేటలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహాలకు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ సలీమ్, నాయకులు షేక్ మున్నీ, శామ్యూల్, రామనాధం పూర్ణచంద్రరావు, హనుమంతరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం వితరణ



ఆత్మకూరు(మంగళగిరి): మండలంలోని ఆత్మకూరు గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ గుడి జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛను పథకానికి తూట్లు!

- రీ వెరిఫికేషన్ పేరిట తెనాలిలో 488 పింఛన్‌లు తొలగింపు
- దివ్యాంగుల నుంచి వృద్ధాప్య పింఛన్‌లకు 143 మార్పు
- ఆందోళనలో దివ్యాంగులు



పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి(ఫైల్)



దివ్యాంగులకు ఇచ్చిన పింఛను రద్దు నోటీసు

తెనాలి అర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఒకవైపు పింఛను నగదు పెంచామని గొప్పలు చెప్పుకొంటూ దివ్యాంగులు, హెల్త్ పింఛన్‌లకు రీ వెరిఫికేషన్ పేరిట మంగళం పాడుతోంది. తెనాలి నియోజకవర్గంలో ఈనెల నుంచి 488 దివ్యాంగుల పింఛన్‌ను రద్దు చేయడంతో పాటు 143 పింఛన్‌లను వృద్ధాప్య పింఛన్‌లుగా మార్పు చేసింది. దీంతో దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

రీ వెరిఫికేషన్‌కు నోటీసులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల కోతకు సిద్ధమైంది. దీనిలో భాగంగా సుమారు 10 నెలల పాటు స్పౌజ్ పింఛన్‌లను మంజూరు చేయకుండా కాలయాపన చేసింది. ఇటీవల వాటిలో కొన్నింటిని మంజూరు చేసి పంపిణీ చేసింది. ఇది ఇలా ఉంటే గతంలో సదరం సర్టిఫికెట్‌ల ద్వారా దివ్యాంగుల పింఛన్‌లు అందుకుంటున్న వారి సంఖ్యను తగ్గించాలనే ఉద్దేశంతో రీ వెరిఫికేషన్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిలో భాగంగా సచివాలయ ఉద్యోగుల ద్వారా రీ వెరిఫికేషన్‌కు రావాలని దివ్యాంగులకు నోటీసులు అందజేసింది. తెనాలి జిల్లా వైద్యశాలలో పరీక్షలు చేయించి వారికి వైకల్య శాతం తక్కువ వేయించి సర్టిఫికెట్‌లు ఇప్పించింది. దీని వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి.

అర్హుల పింఛన్లు రద్దు..

ప్రస్తుతం ఇచ్చిన సదరం సర్టిఫికెట్ల ఆధారంగా తెనాలి పట్టణంలో 194, మండలంలో 163, కొల్లిపర మండలంలో 131 దివ్యాంగుల పింఛన్‌లు రద్దు చేసింది. తెనాలి మండలంలో రద్దు అయిన పింఛన్‌లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఇద్దరు లబ్ధిదారులు ఉన్నారు. అలాగే హెల్త్ పింఛన్‌లు రూ.15 వేల నుంచి దివ్యాంగుల పింఛన్‌లుగా రూ.6 వేలకు తెనాలి పట్టణంలో 13, మండలంలో 30, కొల్లిపరలో 11కు కుదించింది. దివ్యాంగుల పింఛన్‌లను రూ.6 వేల నుంచి వృద్ధాప్య పింఛన్‌లు రూ.4 వేలకు తెనాలి పట్టణంలో 30, మండలంలో 25, కొల్లిపరలో 25కు కుదించింది. కూటమి ప్రభుత్వం దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని కూడా వదలడంలేదన్న మాటలు సర్వత్రా వినబడుతున్నాయి.

పార్టీలకతీతంగా గత ప్రభుత్వంలో..

గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పింఛన్లు అందించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు సార్లు నూతన పెన్షన్లను మంజూరు చేస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా నేటికీ నూతన పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాలేదు. కనీసం వెబ్‌సైట్ కూడా ఓపెన్ కాకపోవడంతో సచివాలయ ఉద్యోగులు అర్హులైన వారు ఇచ్చిన దరఖాస్తులను వారి వద్దే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేయించి రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్‌ను త్వరగా పునఃరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పంటపొలాల ముంపును నివారిస్తాం



ముంపు పొలంలో రైతులతో గోపాలకృష్ణ

తెనాలి: రూరల్ మండలంలోని గుడివాడ, ఎరుకలపూడి, దేవరపల్లి అగ్రహారం గ్రామాలకు చెందిన 200 ఎకరాల్లోని పంటపొలాల మురుగునీటి సమస్య నివారణకు కృషిచేస్తామని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ హామీనిచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీని అందజేశారు. దీంతో తహసీల్దార్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కొలకలూరు రైల్వే స్టేషన్ వద్ద గల పంటపొలాలను, రైల్వే ట్రాక్ కింద గల మురుగు కాలువను పరిశీలించారు. విజయవాడ–చెన్నై రైలు మార్గంలో మూడో రైల్వే ట్రాకు నిర్మాణంతో తమ పంటపొలాల నుంచి మురుగు బయటకు పోవడం లేదని రైతులు తెలిపారు. దీనికి తోడు పాత మురుగు కాలువ కూడా మూసుకుపోయిందన్నారు. గురువారం సర్వేయర్‌తో సర్వే చేయిస్తామని తహసీల్దార్ చెప్పారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకూ ఐక్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో నాగుబోయిన సుబ్రహ్మణ్యం, కంచర్ల రవి, తిరుమల వెంకయ్య, కర్రె గగరి, అప్పల శివరామకృష్ణ, తురక వెంకట్రావు, బండి సుధాకర్, వీఆర్వో కె.భానుకిరణ్ పాల్గొన్నారు.

వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలి

రైతులకు అవగాహన కల్పించిన కేఎల్‌యూ విద్యార్థులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పెదవడ్లపూడి(మంగళగిరి): వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కేఎల్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ కె.వినీల, డాక్టర్ ఎస్.ప్రదీప్‌లు తెలిపారు. బుధవారం మండలంలోని పెదవడ్లపూడి, చినవడ్లపూడి గ్రామాలలో అకాల వర్షాలకు పంటలను ఎలా కాపాడుకోవాలనే అంశంపై పొలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలకు పంటలలో చేరిన నీటిని వెంటనే బయటకు పంపేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల ఎరువుతో భూసారం పెంచుకోవాలని, పండ్లు, పూల తోటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను వినియోగించుకుని లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను పంట పొలాల్లో నీటిని సాధ్యమైనంత వరకు బయటకు పంపి ఎరువులు, పురుగుల మందులు వాడుకుని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఫీల్డు కోఆర్డినేటర్ పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్



విద్యార్థులకు వివరిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్

ఫిరంగిపురం: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ అన్నారు. మండలంలోని అమీనాబాద్, 113తాళ్లూరు గ్రామాల పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, దాని ద్వారా అనారోగ్య సమస్యలు ఏర్పాడతాయన్నారు. వర్షాకాలంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలన్నారు. బోరు నీటిని తాగవద్దని, బోరు నీటిని తాగడం ద్వారా ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంఎల్‌హెచ్‌పీలు కె.బాల అనూష, ఎం.సాగర్‌రాణి, ఏఎస్ఎంలు పి.నిర్మల, ఎస్.అరుణ, ఆశా కార్యకర్త టి.నాగమణి పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించదా..?

యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్



సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు స్టీవెన్

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలియజేసి, మాట్లాడుతూ కార్మికులు తమకు యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిల కోసం గత 260 రోజులుగా సమ్మె చేస్తున్నారని అన్నారు. కొలనుకొండలో నివసిస్తున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు మెగ్గయ్య గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడని, అతడు సిమెంట్ ఫ్యాక్టరీలో 15 సంవత్సరాలు పనిచేశాడని అన్నారు. కార్మికులు అతి దారుణమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎం.ఆశీర్వాదం, వై.సాంబశివరావు, పిచ్చయ్య, నాగేశ్వరరావు, ఖాసిం, దేవరాజు, దుర్గారావు, రహీముల్లా, కాసమ్మ, టి.దుర్గాభవాని, ఇమాంబి, శివకుమారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిమాండ్ నోటీసు అందజేత

దుగ్గిరాల: ఉపాధ్యాయుల జీతాల బిల్లులు సక్రమంగా ఇవ్వాలని వివిధ సంఘాల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. దుగ్గిరాల సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షుడు రామచంద్రయ్యతో కలిసి వివిధ సంఘాల యూనియన్ నాయకులు బుధవారం డిమాండ్ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలు బిల్లుల వ్యవహారంలో సబ్ ట్రెజరీ కార్యాలయం సిబ్బంది అవలంబిస్తున్న విధానాలు మార్చుకోకపోతే ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఉన్నం ప్రసాద్, పొన్నెకంటి సురేష్, బుల్లా మరియదాసు, ఆర్‌వీ ప్రసాద్, లక్ష్మణ్, చలపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన జేసీబీ



మేడికొండూరు : మండల పరిధిలోని పేరేచర్లలో బుధవారం ఆర్టీసీ బస్సును జేసీబీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మేడికొండూరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పిడుగురాళ్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పేరేచర్ల జంక్షన్‌లో ప్రమాదానికి గురయింది. పక్క రోడ్డు నుంచి గుంటూరు రోడ్డులోకి వస్తున్న జేసీబీ బస్సు వెనుక భాగంలో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనుక భాగంలో కిటికీ వెంబడి కూర్చున్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగుల్ సాహెబ్ తెలిపారు.

మంగళగిరిలో 17 నూతన మద్యం బార్‌లకు నోటిఫికేషన్

మంగళగిరి టౌన్: మూడేళ్ల కాలపరిమితితో నూతన మద్యం బార్ పాలసీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. మంగళగిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో జనరల్ కేటగిరీలో 17 బార్ అండ్ రెస్టారెంట్లకు నోటిఫికేషన్ ఇచ్చామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జి.వీ రాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నూతన విధానంలో 5 లక్షలలోపు జనాభా కలిగిన ప్రాంతాలకు వార్షిక లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలని, నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలుగా నిర్ణయించామని, అదే విధంగా కల్లుగీత కులాలకు నగర పరిధిలో 2 బార్ అండ్ రెస్టారెంట్లకు నోటిఫికేషన్ ఇచ్చామని, వార్షిక లైసెన్స్ ఫీజు రూ.27.5 లక్షలు కాగా, నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలుగా నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ విధానంలో చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో చేసుకునే వారు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు, కల్లుగీత కులాలకు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ది డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం గుంటూరులో చేసుకోవచ్చని, ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చినపుడు మాత్రమే లాటరీ విధానం అమలు చేయబడుతుందని ఆయన తెలిపారు. జనరల్ కేటగిరీ దరఖాస్తులకు 28వ తేదీ ఉదయం 8 గంటలకు, కల్లుగీత కులాల దరఖాస్తులకు 30వ తేదీ జిల్లా కలెక్టర్‌చే లాటరీ విధానంలో పారదర్శకంగా కేటాయించబడతాయని తెలిపారు. నూతన విధానంలో బార్‌లు ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 వరకు నిర్వహించుకోవచ్చని, వార్షిక లైసెన్స్ రుసుము 6 సమాన వాయిదాలలో చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు, లైసెన్స్ పొందిన వారు 15 రోజులలోపు రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రి లోకేష్ స్థానికంగా పర్యటించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



తాడేపల్లిరూరల్ : విద్య, ఐటీ శాఖల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ 8 గంటల్లో పదుల సంఖ్యలో కేంద్ర మంత్రులను కలిశానని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, కానీ స్థానికంగా పర్యటించడం లేదని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ విమర్శించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి లోకేష్ నియోజకవర్గంలో ఎందుకు పర్యటించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు జరిపారో ఆలోచించుకోవాలని అన్నారు. పట్టణాల్లో ఇల్లులేని పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు అందరూ సహకరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి అర్బన్: మలేరియా నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా విభాగం ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకాటు వల్ల మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. నీటి నిల్వల్లో దోమలు గుడ్లు పెట్టి వాటి సంతతిని పెంచుకుంటాయని చెప్పారు. అందరూ దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని తెలిపారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు మాట్లాడుతూ.. 2027 నాటికి దేశంలో ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. 2030 నాటికి మలేరియా రహిత దేశంగా ప్రభుత్వాలు తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. అనంతరం దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఆరోగ్యాధికారులు డాక్టర్ వేముల ప్రియాంక, డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, సహాయ మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి అర్బన్: కాలువల్లో చెత్త వేయకుండా చూడాలని లక్ష్మీపతిరావు సూచించారు. 37వ వార్డులో బుధవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టరును ఆవిష్కరిస్తున్న సింగారావు

తెనాలి: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 23, 24, 25, 26 తేదీల్లో జరుగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రాష్ట్ర 28 మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు కోరారు. సంబంధిత వాల్ పోస్టరు, కరపత్రాన్ని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2025 డిసెంబరు 26 నాటికి 100 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలోనే తొలి రాజకీయ పార్టీ సీపీఐగా చెప్పారు. పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ.. మహాసభల్లో భాగంగా 23న భారీ ప్రదర్శన ఒంగోలులో జరుగుతుందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, అఖిల భారత ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, సీపీఐ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు వంటి ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు గండు శివ, పార్టీ నాయకులు బొల్లిముంత ప్రసాద్, కె.శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ తెనాలి నాయకులు కాబోతు ప్రణీత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్



కొల్లిపర సొసైటీ ఎరువుల నిల్వల తనిఖీల్లో అధికారులు

కొల్లిపర, తెనాలి టౌన్: నియోజకవర్గంలో ఎరువుల కొరతపై 'రైతుల నెత్తిన ఎరువు బరువు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. వ్యవసాయశాఖ తెనాలి ఏడీఏ కె.రాజకుమారి, వ్యవసాయ అధికారులు కొల్లిపర, తెనాలి మండలాల్లో ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను తనిఖీ చేశారు. నియోజకవర్గంలో యూరియా 325 మెట్రిక్ టన్నులు, డీఏపీ 305 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 872 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ (పొటాష్) 66 టన్నులు ఉన్నట్లు గుర్తించారు. ఇదే రోజు అత్తోటకు 20 టన్నులు, శివలూరుకు 15 టన్నుల యూరియా, 5 టన్నుల డీఏపీ ఎరువులు వచ్చాయి. గురువారం నుంచి 3 రోజులపాటు ఎరువులతో కూడిన రైల్వే ర్యాక్‌లు రానున్నాయని.. ఎరువులు పుష్కలంగా అందుబాటులో ఉంటాయని రాజకుమారి చెప్పారు. రైతు సేవా కేంద్రాలకు ఎరువులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని.. అన్నదాతలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించవద్దని హెచ్చరించారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కొల్లిపర, తెనాలి వ్యవసాయ అధికారులు ఎస్.శ్రీనివాసరెడ్డి, కె.సుధీర్ బాబు పాల్గొన్నారు.

చిమ్మన, అందేలకు నివాళులు



చిమ్మన, అందే చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చేనేత నాయకులు

మంగళగిరి టౌన్: చేనేత నాయకులు, రచయిత, విలేకరిగా విశేష సేవలు అందించిన చిమ్మన నాగభూషణం, అందే నరసింహారావులు ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం నాయకులు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం చిమ్మన నాగభూషణం, అందే నరసింహారావుల వర్ధంతి సభను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం చిమ్మన, అందేలు పోరాడారని అన్నారు. వారి స్ఫూర్తితో రానున్న కాలంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణారావు, నియోజకవర్గ అధ్యక్షులు గిరి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దత్తపీఠం అభివృద్ధికి జయశంకర్ కృషి ఎనలేనిది



ఫిరంగిపురం: దత్తపీఠం అభివృద్ధికి నిర్వాహకులు వై.జయశంకర్ కృషి ఎనలేనిదని పండిత నారాయణం ప్రసాదాచార్యులు అన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అమీనాబాద్ గ్రామ దత్తపీఠం నిర్వాహకులు పండిట్ వై.జయశంకర్ దంపతులకు సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రసాదాచార్యులు మాట్లాడుతూ దత్తపీఠం నిర్వాహణలో భాగంగా అమీనాబాద్ గ్రామంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల సహకారంతో స్వామి వార్ల శాంతి కల్యాణాలు నిర్వహించారని చెప్పారు. అన్నదానాలు, గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆదరణను జయశంకర్ పొందారని తెలిపారు. అనంతరం జయశంకర్ దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రుద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పండిట్ రవిశంకర్, యాపిల్ స్కూల్ కరస్పాండెంట్ ఇమ్మడి రవికుమార్, ఎం.తారకం, నారాయణం వంశీకృష్ణ, అబ్బేశ్వరరావు, లక్ష్మీఅన్నపూర్ణమ్మ, నిర్మల్‌కుమార్, పి.హనుమాన్‌సూరి, సూర్యనారాయణ మూర్తి, అద్దేపల్లి సీతారామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.